నేడు పల్స్‌పోలియో

- కూకట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో 8800 మంది చిన్నారులు. 14 సబ్ సెంటర్ల ద్వారా 70 మంది సిబ్బంది
- బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 51,299 మంది చిన్నారులకు 13 సబ్ సెంటర్ల ద్వారా 146 మంది సిబ్బందితో చుక్కల మందు పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో మోతాదు ప్రతిసారి ఇవ్వాల్సిన అవసరం తప్పనిసరి. ఆదివారం చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమానికి బాలానగర్, కూకట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని ప్రాంతాలలో పల్స్ పోలియో సెంటర్ల వద్ద తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఇప్పటికే టీమ్‌ల వారీగా కార్యాచరణ సిద్ధం చేశారు అధికారులు. పల్స్ పోలియో కార్యక్రమం వంటి మహత్తరమైన ఈ కార్యక్రమానికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమానికి ఆశా వర్కర్లు, వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఇప్పటికే రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశారు. నియోజవకర్గ పరిధిలోని కూకట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో 8800 మంది చిన్నారులు ఉన్నారు. 14 సబ్ సెంటర్ల ద్వారా 70 మంది సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అదే విధంగా బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 51,299 మంది చిన్నారులకు చుక్కల మందులు పంపిణీ చేయనున్నారు. 13 సబ్ సెంటర్ల ద్వారా 146 మంది సిబ్బందితో చుక్కల మందును పంపిణీ చేయడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి పద్మజ సిద్ధం చేశారు.



60 వేల మందికి...

పల్స్ పోలియో కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటూ చుక్కలు వేయించుకునేందుకు వచ్చే చిన్నారులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. ఒక్కో కేంద్రం వద్ద 4 నుంచి 5 మంది సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా జంట సర్కిళ్ల పరిధిలో 8 డివిజన్‌లలో వైద్యాధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. దాదాపు 500 మంది సిబ్బందితో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నట్లు కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, స్థానిక కాలనీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 20 మంది సూపర్ వైజర్లతో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. అదే విధంగా ఓ మొబైల్ టీం కూడా ఎప్పటికప్పుడు పనిచేస్తుంది. ఇందుకోసం మెడికల్ అధికారి ఇద్దరు, ఎంపీహెచ్ అధికారులు, స్టాఫ్ నర్సు, ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ అందరూ పూర్తి స్థాయిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయా సెంటర్‌ల వద్ద అందుబాటులో ఉంటారు.

ఇంటింటికీ వెళ్లి..

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు కూకట్‌పల్లి, బాలానగర్ పీహెచ్‌సీ డాక్టర్లు మమతా, పద్మజా తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులకు పల్స్ పోలియో అందించడమే కాకుండా స్థానికంగా వెల్ఫేర్ అసోసియేషన్‌లు, ఎన్జీవో ఆర్గనైజేషన్లతో కలిసి పనిచేసి అందరికీ పోలియో చుక్కలను అందజేస్తామని తెలిపారు. మరుసటి రోజు నుంచి ఇంటింటికి తిరిగి పల్స్ పోలియో చుక్కలను అందజేస్తామని, ముఖ్యంగా ప్రయాణాల్లో ఉండే వారికోసం బస్టాపుల్లో, రైల్వే స్టేషన్‌ల వద్ద పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఏ కారణం చేతనైనా పోలియో సెంటర్ వద్దకు రాని చిన్నారుల వద్దకు తమ సిబ్బంది వెళ్లి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయనున్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న సొసైటీ సభ్యులు

మోతీనగర్: మోతీనగర్‌లో నెలకొన్న పలు సమస్యలను ఆయా శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో దశలవారీగా పరిష్కరిస్తానని మోతీనగర్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ అన్నారు. సొసైటీ లిమిటెడ్ మోతీనగర్ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. రోడ్లపై, ఫుట్‌పాత్‌లపైన అక్రమంగా వెలిసిన ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరారు. ముఖ్యంగా వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు, భుజముల నాగేశ్వరరావు, నలమాల్పు అంజిరెడ్డి, రమేష్ అయ్యంగార్, గూడూరు చిన్నారెడ్డి,బ బ్రహ్మానందరెడ్డి, పీకే గోపాల్‌రావు, జేబీఎస్ చౌదరి, బొమ్మగాని సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న కొలను వెంకటేష్, హనుమంతరావు

మోతీనగర్: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొలను వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సీహెచ్. హనుమంతరావు అన్నారు. శనివారం మూసాపేట డివిజన్, అవంతినగర్‌లో నిర్మించిన శివరామాంజనేయ ఆలయ అభివృద్ధికి మోతీనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజాభివృద్ధికి, ఆలయాలకు వెచ్చించాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి మనీ, ఉపాధ్యక్షులు తిరుమలేష్ యాదవ్, రామలక్ష్మి, సంయుక్త కార్యదర్శి కిరణ్, సభ్యులు బబ్లు, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

పండరినాథ్, రుక్మిణి మాతకు పూజలు



మూసాపేట: మూసాపేటలోని పండరినాథ్ ఆలయంలో శనివారం పండరినాథ్, రుక్మిణి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా రోజు నుంచి 11 రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు, హరినామ సప్తాహ కార్యక్రమాలు నిర్వహించి అన్న సమారాధన చేశారు. కార్యక్రమానికి కార్పొరేటర్ మహేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు శ్రావణ్‌కుమార్, బాబురావు, నాయకులు జిల్లా గోపాల్, మున్నా, తూము మనోజ్‌కుమార్, రాజు, ఆలయ నిర్వాహకులు పి. ఉమాకాంత్, ఎం. విశ్వనాథ్, కిషన్ రావు, నర్సింగ్‌రావు, గోపాలరావు, కండేరావు తదితరులు పాల్గొన్నారు.

మహా భజన సప్తాహ కార్యక్రమం



మూసాపేట: మూసాపేటలోని పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా భజన సప్తాహ కార్యక్రమం శనివారం ఘనంగా కొనసాగింది. ఈ సప్తాహ భజనోత్సవంలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రసిద్ధ భజన మండలి సంస్థలు, హరిదాసులు పాల్గొన్నారు. పాండురంగ భజన మండలి అధ్యక్షులు సూర్యనారాయణ కాశీనాథ సూర్యకర్ ఆహ్వానం మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మూసాపేటలోని పాండురంగ విఠల స్వామి వారి ఆలయాన్ని సందర్శించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో సప్పిడి శ్రీనివాసరావు, కేబుల్ శ్రీనివాస్, పాండురంగ భజన మండలి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

బాలానగర్: బాలానగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త స్వాతి కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. ఆమె మామ అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, దారం సతీష్ గుప్తా తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే క్రింది నెంబర్లకు ఫోన్ చేసి తెలియచేయాలని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎఫ్ఓసీ 8712472713, ఏఈ 8712472696, ఏడీఈ కూకట్‌పల్లి 8712472694, డీఈ కూకట్‌పల్లి 8712472652 నెంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

అనుమతులు రద్దు చేయాలని వినతి



పీఏసీ చైర్మన్ గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న ఆదిత్యనగర్ వాసులు

ఆల్విన్‌కాలనీ: అధికారులను తప్పుదోవ పట్టించి అక్రమ పద్ధతిలో తీసుకున్న అనుమతులను రద్దు చేయాలని ఆదిత్యనగర్ కాలనీ వాసులు శనివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డి దారిన అనుమతులు తెచ్చుకొని బహుళ అంతస్తులు నిర్మిస్తున్న ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఆదిత్యనగర్, నాగార్జున హోమ్స్, పరిసర ప్రాంత వాసులు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. వెంకట ప్రణీత్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మాత్రం 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ చూపించి జీ+37 ఫ్లోర్ల బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకున్నట్లు కాలనీ వాసులు వివరించారు.

అరుదైన శస్త్ర చికిత్స

మాదాపూర్: గన్‌షాట్ బాధితుడికి రోబోటిక్ సర్జరీతో కొత్త జీవితాన్ని అందించారు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్లు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సోమాలియాకి చెందిన 20 సంవత్సరాల యువకుడు తుపాకీ కాల్పునకు గురవడంతో రెండు మూత్రనాళాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలలో చూపించిన ప్రయోజనం లేదని తెలిపారు.స్పెషల్ స్కానర్‌లో రెండు కిడ్నీలు ఆరోగ్యంగా ఉన్నప్పటికి వాటి నుంచి మూత్రాశయానికి వెళ్ళే మార్గం పూర్తిగా బ్లాక్ అయినట్టు డాక్టర్లు కనుగొన్నారు. యూరాలజీలో అరుదైన అత్యంత క్లిష్టమైన అత్యాధునిక రోబోట్ అసిస్టెడ్ రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ చేశారు. కోతలు లేకుండా కేవలం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్ : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఈ నెల 9వ తేదీ లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారం వైపు ఉన్న రోడ్డుపై ఓ గుర్తు తెలియని వ్యక్తి (50) కింద పడిపోయి ఉన్నాడు. దీనిని గమనించిన వాహనదారులు చందానగర్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించి గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా మహంకాళి అమ్మవారి ఆలయ వేడుకలు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ గంగపుత్ర సంఘంలోని మహంకాళి ఆలయ 25వ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జనార్ధన్, జనరల్ సెక్రటరీ శివకుమార్, దానయ్య, రాజు, శంకర్ , పెంటయ్య, సంజీవ, శ్రీనివాస్, అశోక్, నర్సింగ్, విజయ్, సంతోష్, వీరేష్ పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో ఇంటీరియర్ ఎక్స్‌పో -2025



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శనివారం హైదరాబాద్ ఇంటీరియర్ ఎక్స్‌పో -2025ను ఏర్పాటు చేశారు. గృహ యజమానులకు, డిజైన్ ప్రేమికులకు కావాల్సిన అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని మ్యాజిక్ బ్రిక్స్ సీఈఓ సుధీర్ తెలిపారు. మాడ్యులర్ కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు, ఫర్నిషింగ్స్, స్మార్ట్‌హోం టెక్నాలజీలను ప్రదర్శించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో భాగస్వాములు కావాలని మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హన్మంతరావు ఆటోడ్రైవర్లకు సూచించారు. శనివారం రాయదుర్గంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్‌కు ప్రయత్నించవద్దని సూచించారు.

దుర్గం చెరువులో వ్యక్తి మృతదేహం

మాదాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం దుర్గం చెరువులో లభించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెరువులో తేలియాడుతుందని సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఎత్తు 5.5 అడుగులు, నీలిరంగు చొక్కా, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నట్టు తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో శనివారం రూ.16 లక్షల వ్యయంతో జరుగుతున్న మంచినీటి పైపులైన్ పనులు, ఆర్‌కే సొసైటీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లో ప్రెషర్ కారణంగా పర్వత్‌నగర్‌లోని పలు వీధులలో మంచినీటి కొరతతో ప్రజలు ఎన్నో రోజులుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్‌కే సొసైటీలోని కన్యకా పరమేశ్వరి ఆలయం పక్క వీధిలో భూగర్భ డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాహిద్ షరీఫ్ బాబా, షేక్ సుభాన్, రాము యాదవ్, బ్రహ్మ, కొండన్న, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

కార్పొరేటర్ పరామర్శ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దార్‌నగర్ డి బ్లాక్‌లో బీఆర్ఎస్ కార్యకర్త యూసుఫ్‌ను శనివారం కార్పొరేటర్ సబిహాబేగం పరామర్శించారు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఒక శుభకార్యానికి వెళ్లారు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అతని ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఆయన నివాసానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

మోతీనగర్: ప్రజా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఇంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికలో ఉద్యమకారులకే తమ మద్దతు ఉంటుందన్నారు.

నేడు ట్రాఫిక్ సమస్యపై అవగాహన

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పాపిరెడ్డినగర్ బస్తీలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆదివారం ఉదయం బస్తీ వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బస్తీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీ వాసులు ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

స్పందించారు.. చెత్తను తొలగించారు



చెత్త కుప్పలను తొలగించి డస్ట్‌బిన్ ఏర్పాటు చేసిన సిబ్బంది



అంజయ్యనగర్‌లో చెత్తను తొలగించిన ప్రాంతం

సాక్షి ఎఫెక్ట్..

ఓల్డ్ బోయిన్‌పల్లి: 'పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. హస్మత్‌పేట నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి వెళ్లే రహదారిలో పేరుపోయిన చెత్తను తొలగించారు. అంజయ్యనగర్‌లో రహదారి పక్కనే ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్ రెడ్డి, జవాన్ రాజు, ఎస్ఎఫ్ఏ సంపత్, శ్రీనివాస్‌గౌడ్, రాంకీ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

మెనోపాజ్‌పై అవగాహన

ఆల్విన్‌కాలనీ: నేషనల్ బెనిఫిట్స్ సంస్థ ఆధ్వర్యంలో రాందేవ్ రావ్ హాస్పిటల్‌లో సీఈవో యోబు డైరెక్టర్ డాక్టర్ కరుణాకర్, గైనకాలజిస్ట్ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ ఛాయ, నేషనల్ బెనిఫిట్స్ సంస్థ విజయ, డాక్టర్ లక్ష్మీ, రాజేంద్రప్రసాద్‌తో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మెనోపాజ్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల్లో మెనోపాజ్ దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై మహిళలు ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. మహిళలు ఈ దశలో ఎదుర్కొనే మార్పులను అర్థం చేసుకొని సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలకు గైనకాలజీ సంబంధిత పరీక్షలు, మమోగ్రామ్ టెస్టులు నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రోజాదేవి, ఆసుపత్రి వైద్యులు

ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలి

మోతీనగర్: నూతన ఆలయాల పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని దేవదాయ ధర్మాదాయ శాఖ శ్రీ హనుమాన్ దేవాలయం కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ మూసాపేట డివిజన్ మోతీనగర్ ప్రధాన రోడ్డులోని హనుమాన్ దేవాలయంలో దత్తాత్రేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణానికి దాతలు డాక్టర్ సుస్మిత, భరత్ రెడ్డి దంపతులు సుమారు 20 లక్షల రూపాయల నిధులతో ఆలయ పునర్ నిర్మాణానికి శనివారం పూజలు చేశారు. కార్యక్రమంలో జి. మాణిక్ రెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.



దాతలు సుస్మిత, భరత్‌రెడ్డిలను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- దుకాణ ఏర్పాటుకు స్థల హక్కుదారుని ఆమోదపత్రం కూడా అవసరం
- 'సాక్షి'తో కూకట్‌పల్లి ఎస్ఎఫ్ఓ తోట జగన్మోహన్



తోట జగన్మోహన్

ఇంటర్వ్యూ

కేపీహెచ్‌బీకాలనీ: బాణాసంచా దుకాణాల ఏర్పాటుదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అగ్నిమాపక శాఖ కూకట్‌పల్లి ఫైర్‌స్టేషన్ అధికారి (ఎస్ఎఫ్ఓ) తోట జగన్మోహన్ స్పష్టం చేశారు. ముఖ్యంగా దుకాణాలు ఎక్కడైతే ఏర్పాటు చేస్తారో ఆ స్థల సంబంధిత వ్యక్తుల ఆమోద పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ ప్రభుత్వ విభాగాలకు చెందిన స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్టైతే సంబంధిత విభాగం నుంచి ఎన్ఓసీ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలకు సంబంధించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న: టపాసుల దుకాణాల అనుమతి కోసం ఎవరిని సంప్రదించాలి?

ఎస్ఎఫ్ఓ : టీఎస్ ఫైర్.కామ్ వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా తాము విచారణ జరిపి తదనుగుణంగా అనుమతులకు సంబంధించిన లైసెన్స్ జారీ చేస్తాం.

ప్రశ్న: టపాసుల దుకాణదారులు ఏ విధమైన నిబంధనలు పాటించాలి?

ఎస్ఎఫ్ఓ: టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు ముందుగా స్థల యజమాని నుంచి గానీ, సంబంధిత హక్కుదారుని నుంచి గానీ తమకు అభ్యంతరం లేదని పేర్కొంటూ ఓ పత్రాన్ని అందజేయాలి. ఖాళీ ప్రాంతంలోనే దుకాణాల ఏర్పాటు చేయాలి. ఒకవేళ షాపులో విక్రయాలు కొనసాగించాలనుకుంటే షాపు మాత్రమే సింగిల్‌గా ఉండాలి. షాపునకు షాపునకు మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. జీఐ జింక్ షీట్లతోనే టపాసుల విక్రయశాలలను నిర్మించుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్న: దుకాణాల నిర్వాహకులు ఏవిధమైన జాగ్రత్తలు పాటించాలి?

ఎస్ఎఫ్ఓ : టపాసుల దుకాణాల వద్ద మంటలను ఆర్పే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి. స్మోకింగ్‌కు ఆస్కారం ఇవ్వకుండా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి. డ్రమ్ముల్లో నీటితో పాటు ఇసుక బక్కెట్‌లను ఉంచాలి. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ మాత్రమే ఉపయోగించాలి. దుకాణానికి వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. 18 ఏళ్ల లోపు వారిని పనిలో పెట్టుకోకూడదు. షాపుల వద్ద చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. టపాసుల దుకాణంలో నిరంతరం పర్యవేక్షించేలా ఓ వ్యక్తిని నియమించుకోవాలి.

ప్రశ్న: దీపావళి పండుగ జరుపుకునే గృహనివాసితులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎస్ఎఫ్ఓ: ఇంట్లో బాణాసంచాను విడిగా, ఇతర మండే పదార్థాలకు దూరంగా ఉంచాలి. బాణాసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉండే సిల్క్ దుస్తులు గానీ, సులభంగా అంటుకునే దుస్తులు గానీ ధరించవద్దు. బిగుతుగా ఉండే కాటన్ లేదా త్వరగా అంటుకోకుండా ఉండే దుస్తులను మాత్రమే ధరించాలి. నాణ్యమైన, చట్టబద్ధంగా తయారైన, అనుమతించబడిన మంచి బ్రాండ్ గల బాణాసంచాను కొనుగోలు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణాసంచాను కాల్చాలి. వారిని ఒంటరిగా బాణాసంచా కాల్చనీయవద్దు. రాకెట్లు, పైకి ప్రయోగించే ఇతర బాణాసంచాలను నిటారుగా ఉంచి పైన చెట్లు గానీ, కరెంటు తీగలు లేవని నిర్ధారించుకుని మాత్రమే వెలిగించాలి.

ప్రశ్న: అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి?

ఫైర్‌ఆఫీసర్: షాపుల వద్ద గానీ, లేదా ఇళ్ల వద్ద టపాసులు కాల్చే సమయంలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101కు గానీ, కంట్రోల్ రూమ్ నెంబర్లు 87126 99444/464కు ఫోన్ చేయవచ్చు.